RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 334 పేజీలు - 04 వెల - 05/- శుక్రవారం16 ఆగష్టు 2024

## ప్రజా సంపద దుర్వినియోగం చేసిన వారిని వదిలిపెట్టం

**శేషాచలం అడవుల్లో ఎర్రచందనం కొట్టేశారు.. కర్ణాటకలో అమ్ముకున్నారు.! -ఏపీ డిప్యూటీ సీఎం పవన్.**





ఆంధ్ర ప్రగతి కాకినాడ ఆగస్టు 15: అప్పట్లో బ్రిటిష్ వారిని, వర్తమానంలో నియంతలను ప్రజలంతా ఏకతాటిపై నిలిచి తరిమి కొట్టారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పంద్రాగస్టు సందర్భంగా కాకినాడలో జరిగిన వేడుకుల్లో ఆయన పాల్గొన్నారు. కాకినాడ పోలీసు పరేడ్ మైదానంలో పవన్ కల్యాణ్ జాతీయ జెండా ఎగురవేశారు. అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. జెండా పండుగ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల కోసం భారీగా నిధులు పెంచినట్లు వెల్లడించారు. ప్రజా సంపద దుర్వినియోగం చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. గత ఐదేళ్ల శాంతిభద్రతలు క్షీణించాయన్న పవన్ కల్యాణ్, గత ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. శేషాచలం అడవుల్లో కొట్టేసిన ఎర్రచందనం కర్ణాటకలో అమ్ముకున్నారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి షణ్ముఖ వ్యూహంతో ముందుకెళ్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టుకున్నామని, పేదల ఆకలి తీర్చడానికి ఏర్పాటుచేసే క్యాంటీన్లకు ఎన్టీఆర్ పేరు పెట్టామన్నారు.

## సంపదను సృష్టించే ప్రజా రాజధాని నిర్మిస్తాం!





- ఐదేళ్లలో కోల్పోయిన స్వేచ్ఛను ప్రజలకు అందించాం
- ఉచిత ఇసుక విధానంతో ప్రజలకు మేలు చేసాం
- తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తి లేదు
- విజయవాడలో స్వాతంత్ర్య ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు

2లో

## పేదవారు ఆకలితో అలమటించకూడదు..

**వారికి తిండి పెట్టడం కనీస బాధ్యత'.! -అన్న క్యాంటీన్‌కు విరాళాలివ్వాలి: సీఎం చంద్రబాబు**

**-రాష్ట్రంలో ప్రజలెవరూ పట్టెడన్నం కోసం కష్టాలు పడే పరిస్థితి లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.**

**-సతీమణి భువనేశ్వరితో కలిసి గుడివాడలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు.**

**-పూటకు కేవలం 5 రూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు.**

**ప్రజలు కూడా తమ వంతు సహకారంతో అన్న క్యాంటీన్లు శాశ్వతంగా నడిచేలా విరాళాలివ్వాలని పిలుపునిచ్చారు.**





ఆంధ్ర ప్రగతి గుడివాడ ఆగస్టు 15: అన్నార్తులకు పట్టెడన్నం పెట్టేలా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పేదలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ అన్న క్యాంటీన్ల పునఃప్రారంభానికి శ్రీకారం చుట్టింది. 78వ స్వాతంత్ర్య వేడుకల కానుకగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృష్ణా జిల్లా గుడివాడలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. సతీమణి భువనేశ్వరితో కలిసి గుడివాడ వచ్చిన సీఎం క్యాంటీన్‌లో 5 రూపాయలకే భోజనం కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. సతీమణి భువనేశ్వరితో కలిసి స్వయంగా పలువురికి భోజనం వడ్డించారు. అనంతరం సీఎం దంపతులిద్దరూ ప్రజలతో కలిసి భోజనాన్ని రుచి చూశారు. క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వివిధ వర్గాల వారితో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ఏయే వృత్తుల్లో ఉన్నారు. ఎంత మేరకు ఆదాయం సంపాదిస్తున్నారు వంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఓ వ్యక్తి తాను చెప్పులు కుడుతూ జీవనం సాగిస్తున్నానని, దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉందని చెప్పగా ఆయనకు సహాయం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. మరో చిరు వ్యాపారికి కొత్త తోపుడు బండి ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు.

## వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



ఆంధ్ర ప్రగతి తాడేపల్లి ఆగస్టు 15: వైయస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన వైయస్సార్ పార్టీ అధినేత వైయస్ జగన్.అనంతరం జాతీయ నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి మాజీ సీఎం జగన్ నివాళులర్పించారు.కార్యక్రమానికి హాజరైన శాసనమండలి ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు గారు, విడదల రజని, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తదితరులు.

## ఆ పదవికి ఖుష్బూ రాజీనామా.!



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 15: బీజేపీ నేత, ప్రముఖ సినీ నటి ఖుష్బూ కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యత్వ పదవికి ఆమె రాజీనామా చేశారు. తన ఎక్స్ (ట్విటర్) బయోలో సైతం మహిళా కమిషన్‌లో సభ్యురాలనే విషయాన్ని ఆమె తొలగించారు. జాతీయ మహిళ కమిషన్ సభ్యురాలిగా ఏడాదిన్నర పాటు ఆమె సేవలు అందించారు. పదవికి రాజీనామా లేఖను ఆమె జులైలోనే సమర్పించారు. దానిని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ తాజాగా ఆమోదించింది.

## సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నాం.!

- -తల్లికి వందనం కార్యక్రమాన్ని అమలుచేస్తాం.
- -అనవసరమైన నిబంధనలతో పథకాలు కట్ చేయం.
- -పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పనులను ప్రారంభిస్తాం.
- -గుంటూరులో భూగర్భడ్రైనేజి త్వరలో పూర్తి చేస్తాం!
- -మంగళగిరి-తాడేపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఏర్పాటుచేస్తాం!
- -స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్.



2లో



## వికసిత ఏపీ కోసం అందరం కలిసి పని చేద్దాం.!

**-గుంటూరులోని బిజెపి కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించిన ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి.**

**-ప్రజల సమస్యల పరిష్కారం కోసం వారధి అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని వెల్లడి.**

ఆంధ్ర ప్రగతి గుంటూరు ఆగస్టు 15: ఎందరో మహానుభావులు ఎన్నో త్యాగాలు చేసి, మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. ఆనాడు దాదాపు 40 కోట్ల మంది దేశ ప్రజలు స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారని చెప్పారు. ఇప్పుడు దేశ జనాభా 144 కోట్లకు చేరుకుందని... దేశ ఐక్యతను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. దేశ ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని చెప్పారు.



మిగతా 2లో

# అమరవీరులకు సన్మాన కార్యక్రమం

**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ ఆగస్టు 15:** ఆగస్టు 15 గురువారం రోజున నంద్యాల మండలం, కొత్తపల్లి గ్రామం శ్రీ శారదా విద్యాపీఠం ప్రాథమిక పాఠశాల నందు 78 వభారత స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా వందన కార్యక్రమం నిర్వహించి చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు తదనంతరం, మన భారతదేశ సైన్యంలో విధి నిర్వహణలో అమరులైన సిద్ధం సుబ్బరామయ్య కుటుంబాన్ని సన్మానిస్తూ బిఎస్ఎఫ్ లో పనిచేస్తూ బాంబు దాడిలో గాయపడి, ఒక కన్ను కోల్పోయిన బిఎస్ఎఫ్ జవాన్ హఫిజుల్లా కి సన్మా నం చేసి వారికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. డాక్టర్ విజయబాబు, డాక్టర్ సురేందర్,







డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, ఎన్ ఐ టి సి హాస్పిటల్ వారు దీనికి సహకరించారు. గడిచిన మూడు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం అమరులైన కుటుంబాలకు అండగా ఉంటూ ఆర్థికంగా సహకరిస్తూ వారికి కావలసిన వైద్య సదుపాయం లో ఉచితంగా సహకరించడం మన నంద్యాల జిల్లాలో గొప్ప మనసు కలిగిన డాక్టర్లు ఉండటం మన నంద్యాల జిల్లా అదృష్టమని శ్రీ శారద విద్యాపీఠం స్కూల్ కార్యదర్శి రాంప్రసాద్ గారు కొనియాడారు ఈ కార్యక్రమానికి ఆహ్వాప అధ్యక్షులు వీజీకే గోపాలకృష్ణమూర్తి, చంద్రశేఖర ప్రసాద్ చింతలపల్లి వాసు, మునుస్వామి , అనేకమంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డాక్టర్ సంజీవ పుట్టినరోజు సందర్భంగా
# మెగా రక్తదాన శిబిరం



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల (వీరారెడ్డి పల్లె) ఆగస్టు 15:
సిరివెళ్ల మండల పరిధిలోని వీరారెడ్డి పల్లె గ్రామంలో గురువారం నాడు 78 స్వాతంత్ర దినోత్సవ, స్పెషలిస్ట్ డాక్టర్ సంజీవ పుట్టినరోజు వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి.
టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గోగి శెట్టి నరసింహారావు ఆధ్వర్యంలో తల సేమియా విద్యార్థులకు, గర్భిణీ మహిళల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.
డాక్టర్ సంజీవ మాట్లాడుతూ.. స్వాతంత్ర దినోత్సవం అలాగే నా పుట్టినరోజు సందర్భంగా గోగిశెట్టి నరసింహారావు అభిమానులు, టిడిపి కార్యకర్తలు సుమారు 70 మంది రక్తదాన శిబిరంలో రక్త దాతలు పాల్గొన్నారని వారు తెలిపారు.రక్తదాన శిబిరంలో పాల్గొన్న రక్తదాతలకు ధన్యవాదాలు తెలుపుతూ, వారికి సర్టిఫికెట్లు అందజేశారు.రుద్రవరం, సిరివెళ్ల ఉయ్యాలవాడ, తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ సంజీవ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ పది కాలాలపాటు చల్లగా ఉండాలని దీవించరు.రక్త దాతలతో కలిసి స్పెషలిస్ట్ డాక్టర్ సంజీవ వీరారెడ్డి పల్లె గ్రామంలో, జెండా ఎగరవేసి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి, పలు రకాల తిను బండారాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నజీర్, నాగరాజు, లక్ష్మీ నరసింహ, పవన్, బిజెపి నేత డాక్టర్ మందుల రామకృష్ణ, టిడిపి మరియు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా రాజధాని నిర్మిస్తాం !

**విజయవాడ,ఆంధ్ర ప్రగతి ఆగస్టు 15:**
గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను తిరిగి పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ భ్రష్టు పట్టాయని అన్నారు. మళ్లీ పరిస్థితిని గాడిన పెట్టి, అభివృద్ధిని పట్టాలకు ఎక్కిస్తున్నామని, అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛను అందించేందుకు కట్టుబడి ఉంటాం. ప్రజలకు ఉపయోగపడే విధానాలు రూపొందిస్తున్నాం. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలనకు శ్రీకారం చుట్టాం. 100 రోజుల ప్రణాళిక టార్గెట్‌గా అన్ని శాఖల్లో సమీక్షలు చేస్తున్నాం. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన శాఖల్ని పునరుద్ధరిస్తున్నాం అని వివరించారు. 1857 కంటే ముందే బ్రిటిష్ దుర్మార్గపు పాలనపై తెలుగు నేల తిరుగుబాటు చేసిందని చరిత్రకారులు చెబుతున్నారు.. ఇది చైతన్యం కలిగిన ప్రాంతం. విభజనతో ఏర్పడిన నవ్యాంధ్రకు రాజధాని కూడా లేని పరిస్థితిలో నాడు పాలన ప్రారంభించాం. అటువంటి పరిస్థితి నుంచి ప్రభుత్వాన్ని పట్టాలెక్కించాం. మాకున్న అనుభవం, ప్రజల సహకారంతో కొద్ది కాలంలోనే నిలదొక్కుకున్నాం. 120కి పైగా సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రథమంగా నిలిచాం. రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుని దేశం దృష్టిని ఆకర్షించాం అని వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం నిర్దిష్ట నిర్ణయాలతో పాలన సాగించబోతున్నాం. నూతన ఆలోచనలతో 15 శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. దేవుడి దయ వల్ల సాగునీటి ప్రాజెక్టులకు జులైలోనే జలకళ వచ్చింది. కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులన్నీ నిండాయి. సమర్థ నీటి నిర్వహణ ద్వారా అన్ని ప్రాంతాలకు సాగునీరందిస్తాం. రైతు ఆదాయం పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం. వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం మా ప్రభుత్వ విధానం. గత ప్రభుత్వ అసమర్థతతో దెబ్బతిన్న పోలవరాన్ని ముందుకు తీసుకెళ్తాం. యువతకు అవకాశాలు సృష్టిస్తే



అద్భుతాలు సాధిస్తారు. అందుకే నైపుణ్య గణనకు శ్రీకారం చుట్టాం. దీంతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేలా చూస్తాం. గత ప్రభుత్వం నిర్మాణ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. గత ప్రభుత్వ ఇసుక దోపిడీపై సీఐడీ విచారణ జరిపిస్తాం. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఉచిత ఇసుకపై నిర్ణయం తీసుకున్నాం. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇసుకను ఆర్డర్ చేసుకునే వెసులుబాటు కల్పించాం. మరింత పకడ్బందీగా దీన్ని అమలు చేస్తాం. ప్రభుత్వ ఉద్యోగులంటే ప్రభుత్వంలో భాగస్వాములు. వాళ్లకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, సూపర్ సిక్స్‌తో 6 హామీలు ఇచ్చాం. రాష్ట్ర పరిస్థితిపై ఏడు అంశాల్లో శ్వేతపత్రాలు విడుదల చేశాం. పోలవరం, అమరావతి, రాజధాని, విద్యుత్ వంటి శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేశాం. సహజ వనరుల దోపిడీని బహిర్గతం చేస్తాం. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టం. నాటి అక్రమాలపై లోతైన దర్యాప్తు చేయిస్తాం. అక్రమార్కులను శిక్షించి తీరుతాం అని చంద్రబాబు తెలిపారు.

## కళారాధన,దివ్యాంగుల సంక్షేమ సంఘం,క్రీడా సమాఖ్య కార్యాలయం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15: నంద్యాల కళారాధన, దివ్యాంగుల సంక్షేమ సంఘం, క్రీడా సమాఖ్య కార్యాలయం వద్ద ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగంలో అంకితభావంతో పనిచేసి దేశఅభివృద్ధిలో పాలుపంచుకోవలసిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ ఎం.పీ.వి. రమణయ్య,కార్యదర్శి చలపతి, ఉపాధ్యక్షులు వెంకటరావు, కళారాధన కార్యవర్గ సభ్యులు శివరామిరెడ్డి,రామయ్య, కార్యాలయ కార్యదర్శి మధు, తదితరులు పాల్గొన్నారు.



# ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ఇలాంటి పరిస్థితి రావటం బాధాకరం.!

### - మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి.



ఆంధ్ర ప్రగతి అనంతపురం ఆగస్టు 15: కండీషన్ బెయిల్ మాదిరి ఐపీఎస్ అధికారులు రోజూ డీజీపీ కార్యాలయంలో సంతకాలు పెట్టాల్సి రావటం దురదృష్టకరమని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రజల్ని, తమని ఎన్ని ఇబ్బందులు పెట్టారో ఇప్పటికైనా గుర్తించాలని హితవు పలికారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాల వల్ల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ఇలాంటి పరిస్థితి రావటం బాధాకరమన్నారు. అధికారులు ఇప్పటికైనా తీరు మార్చుకుని వ్యవహరిస్తారని ఆశించారు.వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్? అధికారులు రోజూ హెడ్‌క్వార్టర్లలో రిపోర్టు చేయాలని డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం వరకు డీజీపీ ఆఫీసులోనే ఉండాలని ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. వెయిటింగ్ హాల్లో ఉన్న అటెండెన్స్ రిజిస్టర్లో సంతకాలు చేయాలని సీనియర్ ఐపీఎస్ లకు డిజిపి ఆదేశించారు. మొత్తం 16 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సందించారు.

# వికసిత ఏపీ కోసం అందరం కలిసి పని చేద్దాం.!

*(మొదటి పేజీ తరువాయి)*
గుంటూరులోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని పురందేశ్వరి ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మోర్చాల రాష్ట్ర అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ, 2040 నాటికి వికసిత భారత్ ను చూడాలనేది మోదీ లక్ష్యమని... వికసిత ఏపీ కోసం అందరం కలిసి పని చేద్దామని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిందని పురందేశ్వరి చెప్పారు. కూటమికి రాష్ట్ర ప్రజలు గొప్ప విజయాన్ని అందించారని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అందరం కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
ప్రజల సమస్యల పరిష్కారం కోసం 'వారధి' అనే కార్యక్రమాన్ని బీజేపీ ప్రారంభించిందని పురందేశ్వరి చెప్పారు. ఈరోజు నుంచి అన్ని బీజేపీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించి, వాటి వివరాలను ఒక యాప్ లో కూడా పెడతామని చెప్పారు. అందరం ప్రజా సేవకులుగా పని చేద్దామని బాధితుల కన్నీరు తుడుద్దామని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మ్యూజియంను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబును కోరామని తెలిపారు.

# సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నాం.!

ఆంధ్ర ప్రగతి గుంటూరు ఆగస్టు 15: రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వాన ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగుతున్న ఈ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రజలందరి కళ్లల్లో ఆనందం కనబడుతోందని, ఇచ్చిన మాట ప్రకారం సూపర్ %-% 6 హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టంచేశారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గుంటూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ లో మంత్రి లోకేష్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన మంత్రిలోకేష్... జిల్లా ప్రజల సమక్షంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా యంత్రాంగం తయారుచేసిన అభివృద్ధి శకటాలను వీక్షించి, ఉత్తమ శకటాలకు అవార్డులు అందజేశారు. స్వాతంత్ర వేడులక సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించి, ఉత్తమ స్టాళ్లకు అవార్డులు అందించారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు, ప్రజా సంఘాలకు మాట్లాడే స్వేచ్ఛ వచ్చింది, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు వచ్చింది. చంద్రబాబు గారి హామీలకు కండిషన్స్ ఉండవు. అనవసరమైన రూల్స్ తో సంక్షేమ కార్యక్రమాలు కట్ చెయ్యం. ఏడాదికి రూ. 250 పెంచడం కాదు... ఒకే సారి వెయ్యి రూపాయిలు పెంచి రూ. 4వేల పెన్షన్ అమలు చేస్తున్నాం. మెగా డిఎస్సీ ప్రకటించి 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. తల్లికి వందనం పథకాన్ని అమలుచేస్తాం, ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తాం. యువత కు 20 లక్షల ఉద్యోగాల కల్పనే మా లక్ష్యం. మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కాబోతుంది. పేద వాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు ఈరోజు నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఆర్థిక సాయం. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తాం, చేనేత వస్త్రాలకు జిఎస్టీ రద్దుపై కేంద్రంతో చర్చిస్తున్నామని మంత్రి లోకేష్ చెప్పారు.గుంటూరు జిల్లా ప్రజలకు 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. %-%మాకొద్దీ తెల్లదొరతనం%-%పాటతో స్వాతంత్ర్య పోరాటంలో కదంతొక్కిన ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ ఈ నేలపైనే జన్మించారు. పెదనందిపాడులో సహాయ నిరాకరణ ఉద్యమం, సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా గుంటూరు, తెనాలి పట్టణాల్లో ఆందోళనలు చేపట్టారు. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో తెనాలికి చెందిన ఏడుగురు ప్రాణ త్యాగాలు చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం తెలుగునేల ఎన్నో త్యాగాలు చేసింది. స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధులు, అమరవీరులకు నా నివాళులు అర్పిస్తున్నాను. దేశం అంటే భక్తి ఉండాలి... తల్లిదండ్రులు అంటే ప్రేమ ఉండాలి. ఉపాధ్యాయులంటే గౌరవం ఉండాలి. ఎన్నో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు చూసాను. కానీ ఈ రోజు జరుగుతున్న ఈ వేడుకలు నాకు జీవితాంతం గుర్తుంటాయి. శాంతి, అహింసే ఆయుధాలుగా మహాత్మా గాంధీ గారి మార్గంలో మనం స్వాతంత్ర్యం సాధించుకున్నాం. మొన్న జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు శాంతి, అహింసే ఆయుధాలుగా స్వేచ్ఛ సాధించుకున్నారు.
మంగళగిరిలో జెమ్స్, జ్యుయలరీ పార్కు, వీవర్స్ ఫౌండేషన్ క్లస్టర్ ఏర్పాటు చేస్తాం. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటివరకు 320 ఎంఎస్ఎంఇల ద్వారా 34కోట్లరూపాయల పెట్టుబడితో 725 మందికి ఉపాధి కల్పించాం. ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ పాలసీ కింద ఇప్పటివరకు 263 యూనిట్లకు 197 లక్షల రూపాయలు వివిధ రాయితీలు ఇచ్చాం. పిఎంఇజిపి కింద 41యూనిట్లకు 318 లక్షల మార్జిన్ మనీ సబ్సిడీ ఇచ్చాం. తెనాలిలో దాల్ మిల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రధానమంత్రి చేనేత ముద్రా యోజన క్రింద ఈ ఆర్థిక స%శీ%వత్సరములో 110 మంది లబ్దిదారులకు 1.07 కోట్లరూపాయల రుణము మంజూరైంది. చేనేత రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. దేశంలోనే తొలిసారిగా నైపుణ్యగణన చేపడుతున్నాం. జిల్లాలోని ఎంబిటిఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజిలో స్కిల్ డెవలప్ మెంట్ ఎక్స్ టెన్షన్ సెంటర్ ఏర్పాటుకి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉచిత ఇసుక విధానము అమలులోకి తీసుకొచ్చాం. ఉచిత ఇసుక విధానాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతాం. బలహీన వర్గాల వారిని పేదరికం నుండి బయటకు తీసుకురావడానికి అనేక ప్రణాళికలు అమలు చేస్తున్నాం. 2024 కేంద్ర వార్షిక బడ్జెట్ లో రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. సిఆర్ డిఎ పర్యవేక్షణలో రాజధాని నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం. నల్లపాడు-బీబీనగర్ స్టేషన్ల మధ్య గల ట్రాక్ డబ్లింగ్ ను, అమరావతి మీదుగా ఎర్రుపాలెం నంబూరు స్టేషన్ ల మధ్య కొత్తగా నిర్మించే రైల్వే బ్రాడ్ గేజ్ లైనుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టుగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టుల కోసం భూ సేకరణ పూర్తి చేసి, పనులు ప్రారంభించానికి చర్యలు తీసుకుంటాం.
ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ 2047 స్ఫూర్తితో వికసిత్ ఆంధ్ర 2047 లక్ష్య సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం. డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి అక్టోబర్ 2వ తేదీన ఆవిష్కరిస్తాం. చంద్రబాబు గారి ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ ను గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రముగా తీర్చిదిద్దేందుకు వంద రోజుల ప్రణాళికతో కఠినమైన చర్యలు తీసుకున్నాం. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు సహకారం అందిస్తున్న ప్రజా ప్రతినిధులకు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు. అమరులైన స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలకు, జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్న జిల్లా కలెక్టరు, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న ఎస్పీ, సత్వర న్యాయ సేవలందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయాధిపతులు, వారి యంత్రాంగానికి నా ప్రత్యేక అభినందనలు. జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న అధికారులు, అనధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకర్లకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేష్ జిల్లా ప్రజలకు 78వ స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.

# నంద్యాల జిల్లా కలెక్టరేట్ లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

## -జాతీయ పతాకాన్ని ఎగురవేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 15:
జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 78వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జాతీయ పతాకాన్ని ఎగురవేసి సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ పద్మజ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మన దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం మనమేమి చేయాలన్నది దృష్టిలో పెట్టుకుని.... ఆ స్ఫూర్తితో ముందుకెళ్లి ప్రయత్నించి పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను బేరీజువేసుకొని ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రపంచ దేశాలలో పోటీపడుతూ భారతదేశం అత్యుత్తమ స్థాయికి దూసుకుపోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మనమందరం మంచి జిల్లాలో ఉన్నామని, చిన్న నీటి బిందువులే మహా సముద్రమైనట్లు.... టీం స్పిరిట్ తో







ప్రతి ఒక్కరూ జిల్లా అభివృద్ధికి, సంక్షేమానికి సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా 78వ స్వాతంత్ర దినోత్సవం.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:
నంద్యాలలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లా నాయకులతో.. కార్యకర్త లతో ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అభిరుచి మధు మాట్లాడుతూ మన దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు ధన, ప్రాణ,మాన,త్యాగాలు పోరాటాలు చేయడం వలన స్వతంత్రం వచ్చింది అని అలాగే దేశం కోసం ఎందరో ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగం వల్ల ఈరోజు మనము ఫలాలను అనుభవిస్తున్నామని అందరు సోదర భావం తో కలిసి మెలిసి ఉండాలని దేశంలోని అన్ని వర్గాల ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని తెలియజేసారు..ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా నాయకులు తాడి రామక్రిష్ణ రెడ్డి పట్టణ అధ్యక్షులు కశెట్టి చంద్ర శేఖర్.. స్వామి రెడ్డి రమేష్ ఉపేంద్ర రెడ్డి చల్ల మద్దిలేటి విష్ణు మూర్తి రాష్ట్ర ఎస్సి మోర్చా కార్యవర్గ సభ్యుడు బాలముని రత్నాకర్ ప్రసాద్ రెడ్డి బత్తిని స్వాతి అరుణ సుజిత మానస గాండ్ల ఈశ్వర్ చింతా నాగేశ్వరావు.. నాగేంద్ర సుబ్బారావు.. ప్రశాంత్ వంశీ..తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన

## నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.

ఆంధ్రప్రదేశ్ నంద్యాల ఆగస్టు 15:
నంద్యాల టిడిపి కార్యాలయం నందు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించడం జరిగింది.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ పరివర్తన్ వారోత్సవాల్లో భాగంగా మరియు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నంద్యాల టీడీపీ కార్యాలయం నందు ఎన్ఎండి ఫిరోజ్ యువసేన ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాట చేయడం జరిగిందని . ఈ రక్తదాన శిబిరంలో చాలామంది యువకులు, స్వచ్ఛందంగా పాల్గొని ఉత్సాహంతో రక్తదానం చేశారని,అలాగే



స్వచ్ఛందంగా రక్తదానం చేసినవారికి ఎన్ఎండి ఫిరోజ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు ఇచ్చి ప్రత్యేకంగా అభినందించడం జరిగిందన్నారు.
ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్ బాషా, సీనియర్ మేనేజర్ మోహన్ రెడ్డి ఆపరేషన్స్ మేనేజర్స్ హరి బాబు & భాగ్యవేణి మరియు



సిబ్బంది, బ్లడ్ ఆర్గనైజర్ సద్దాం, విజయ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసిన సీఐటీయూ నాయకులు



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:
నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి మరియు మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ వర్కర్స్ కి కనీస వేతనం 26000 ఇవ్వాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ను విజయవాడలోని ఉండవల్లిలో ఆయన నివాసంలో కలసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని సిఐటియు జిల్లా కార్యదర్శి వి, బాల వెంకట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకులు నాగన్న, చెన్నయ్య శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాదు, పద్మ, గురుస్వాములు తెలిపారు.ఈ సందర్భంగా నంద్యాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ను మంగళవారం కలిసి వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా మీ సమస్యల పరిష్కారం చేసే బాధ్యత నాది మీకు న్యాయం చేస్తామని చెప్పారని ఈ సందర్భంగా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామన్నారు.ఈ సమావేశంలో బాలయ్య, ఆది, సుమలత, కేసీ చెన్నయ్య, గురు శేఖర్, పద్మ పాల్గొన్నారు.

# సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:
తమ కుటుంబాలను, జీవితాలను ధారపోసి భారత దేశానికి స్వాతంత్రం సాధించిన మహనీయులను స్మరిస్తూ 78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఘణంగా నిర్వహించారు.గురువారం నంద్యాల సమితి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేసిన రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు.
జాతీయ జెండా ప్రాముఖ్యతను ప్రజలందరికి గుర్తుచేసి దేశభక్తిని పెంపొందించేలాగా ప్రతి ఇంటిమీద మువ్వొన్నెల జెండా ఎగరవేసి స్వాతంత్ర దినోత్సవం నిర్వహించేలాగా జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఇచ్చిన ఆదేశాలను రాయలసీమ సాగునీటి



సాధన సమితి అధ్యక్ష్యులు బొజ్జా దశరథ రామిరెడ్డి స్వాగతించారు.
దేశం కోసం, సమాజ హితం కోసం వేలాది మంది నాయకులు, లక్షలాది మంది ప్రజలు కలిసి పోరాటం చేసి సాధించుకున్న స్వాతంత్రం ఆశించిన లక్ష్యాలకు దూరంగా అడుగులు వేస్తున్నదని బొజ్జా ఆవేదన వ్యక్తపరిచారు. యువత, విద్యార్థులలో సమాజహితం, దేశాభిమానం, త్యాగగుణం, నైతిక విలువలు అలవడేలాగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి దేశ పౌరుల ఆలోచన సరళి సక్రమ మార్గంలో నడిచేలాగా ఒక బృహత్ కార్యక్రమానికి అంకురార్పణ చేయలాని బొజ్జా ప్రభుత్వానికి సూచించారు.భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో రాయలసీమ ప్రాంత నాయకులు ముత్తుకూరు గౌడప్ప, గులాం నబీ రసూల్ ఖాన్, ఉయ్యాల వాడ నరసింహ రెడ్డి చేసిన వీరోచిత పోరాటాన్ని ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేసారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు ఏర్వ రామచంద్రా రెడ్డి, కార్యదర్శి మహేశ్వర రెడ్డి, ప్రజా సంబంధ కార్యదర్శి సుదాకర్ రావు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్ , ఎన్ఎండి ఫయాజ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:
నంద్యాల పట్టణంలోని మద్రసా ఎ తొయ్యిబా నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎన్ఎండి ఫిరోజ్, ఎన్ఎండి ఫయాజ్ పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమర పోరాటంలో ఎందరో మహానుభావులు తమ ప్రాణాన్ని సైతం లెక్కచేయ్యకుండా పోరాడి మనదేశాన్ని పరాయి పాలన నుండి విముక్తి చేశారు. ఈ స్వాతంత్ర్య సమర పోరాటంలో ఉలేమాలు ముఫ్తీలు లక్షలాది సంఖ్యలో బలిదానాలు చేయడం జరిగిందన్నారు . భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్న ఇంకా ముస్లిం సమాజం ఎంతో వెనుకబడివుందన్నారు, రాబోయే కొన్ని సంవత్సరాల్లో ధార్మిక విద్యను పూర్తిచేసుకొని సమాజంలో వెళుతున్న మీరందరూ ముస్లిం సమాజానికి దిశనిర్దేశం చెయ్యాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మదరస నిర్వాహకులు, ముస్లిం జేయేసి నాయకులు, మదరస విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా 78వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు

## త్రివర్ణ పథకాన్ని ఆవిష్కరించిన టిడిపి జనసేన సమన్వయకర్త పిడతల సుధాకర్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:
78వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల పద్మావతి నగర్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో టిడిపి జనసేన సమన్వయకర్త పిడతల సుధాకర్ త్రివర్ణ పథకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఎందరో వీరుల త్యాగ ఫలమే నేటి స్వతంత్ర ఫలిత మని, దేశం కోసం బ్రిటీష్ ప్రభుత్వం పై పోరాడి అమరులైన వారు ఎంతమందో ఉన్నారని అన్నారు. ప్రతి ఒక్క భారతీయునికి స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ చౌదరి, సంఘ జయంతి, నగేష్, మణిదీప్, అబ్దుల్ భాష, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 15: మహానంది మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మహానంది తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ రమాదేవి, ఆర్ ఐ సురేంద్ర నాథ్ రెడ్డి ఇతర సిబ్బంది ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఇతర సిబ్బంది, మహానంది పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు మరియు సిబ్బంది, మహానందిలోని విద్యుత్ సబ్స్టేషన్ నందు జూనియర్ ఇంజనీర్ శివ శంకర్ మరియు సిబ్బంది, మహానంది దేవస్థానం కార్యాలయ ఆవరణలో ఏ ఈ ఓ లు మధు మరియు వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది, గ్రామాల్లోని పాఠశాల నందు ప్రధాన ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు మరియు సిబ్బంది జెండాను ఆవిష్కరించారు. మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి హెచ్ఎం అమ్మంబ మరియు పాఠశాల కమిటీ చైర్మన్ ఈదమ్మ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.

# దేశభక్తిని చాటుకున్న "టీ "స్టాల్ నిర్వాహకుడు నాగరాజు



ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ ఆగస్టు 15:
78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణం మెయిన్ బజార్లో శబరిష్ బట్టల అంగడి ఎదురుగా ఉన్న నా" టీ "స్టాల్ నిర్వాహకులు వై.నాగరాజు తన దేశభక్తిని చాటుకున్నారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా కాఫీ అల్లం టీ హార్లిక్స్, టి, రాగి మార్టు,బెల్లం పాలు, లెమన్ టీ కేవలం కప్పు ఒక్క రూపాయి కె విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా తన దగ్గరకు వచ్చేఅన్ని వర్గాల ప్రజలకు టీ, కాఫీ బూస్ట్ బెల్లం పాలు,సొంటి, రాగి మాల్ టు, లెమన్ టీ ఏదైనా సరే ఒక్క రూపాయి మాత్రమే విక్రయిస్తున్నానన్నారు. ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే మన దేశానికి స్వాతంత్రం వచ్చిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. టీ స్టాల్ నాగరాజును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ఆయనను ప్రశంసించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# వైభవంగా నంద్యాల జిల్లాలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.!

**వేడుకల్లో ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేసిన రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి.**































ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 15:

నంద్యాల పట్టణంలోని పీఎస్ సి,& కెవిఎస్ సి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగాయి. ఈ వేడుకలలో రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి జాతీయ పతాకావిష్కరణ గావించి రాష్ట్రీయ సెల్యూట్ చేశారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలతో కలిసి పెరేడ్ మైదానాన్ని పరిశీలించి సాయుధ దళాల వందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి.జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ ఎ. పద్మజ, పట్టణానికి చెందిన ప్రముఖులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సదర్భంగా రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి జిల్లా ప్రజలకు సందేశమిస్తూ ప్రజా సమస్యలకు చక్కటి పరిష్కారం చూపి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే మంచి పాలన అని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి చిత్తశుద్ధితో కృషి చేసేందుకు ఎప్పటికప్పుడు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలన్నారు. మనమంతా కష్ట పడితే 2047 నాటికి ప్రపంచంలోనే మనం నెంబర్ వన్ గా ఉంటామన్నారు.ఎన్.టి.ఆర్. భరోసా పింఛను పథకం క్రింద జులై నెల రూ.4 వేలు, ఏప్రిల్, మే, జూన్ మాసాల పించన్ పెంపు రూ.3 వేలు వెరసి మొత్తం రూ.7 వేలు గత జులై 1 వ తేదిన 2 లక్షల 21 వేల 240 మంది లబ్ధిదారులకు రూ. 150 కోట్లు అందించామన్నారు. ఈ ఆగస్టు మాసంలో 2 లక్షల 19 వేల 863 మంది లబ్ధిదారులకు 92 కోట్ల 88 లక్షల రూపాయలను పంపిణీ చేసామన్నారు.జిల్లాలో 2024-2025 సంవత్సరంలో పి.ఎం.కిసాన్ పెట్టుబడి సాయం క్రింద 1 లక్షా 96 వేల మంది రైతు కుటుంబాలకు 39కోట్ల 20 లక్షల రూపాయలను అందజేయడం జరిగిందన్నారు. పంట రుణాల కింద 2874 కోట్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 94 వేల మంది రైతులకు 1300 కోట్ల రూపాయల పంట రుణాలను బ్యాంకుల ద్వారా అందజేసామన్నారు. జిల్లాలో పశుగ్రాస అభివృద్ధికి 75 శాతం రాయితీతో నాణ్యమైన పశుగ్రాస ఉత్పత్తి విత్తనాలను క్షేత్రస్థాయిలో రైతన్నలకు పంపిణి చేయడం జరుగుతోందన్నారు.బనగానపల్లె పట్టణంలో 15 కి.మీ మేర ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం 35 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కేంద్ర రహదారుల నిధుల క్రింద జిల్లాలో దాదాపు 255 కోట్ల రూపాయలతో 10 రోడ్ల పనుల ప్రతిపాదనలను కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు పంపామన్నారు. అలాగే 9 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులకు అప్ గ్రేడ్ చేసేందుకు కూడ ప్రతిపాదనలు పంపామన్నారు. బొమ్మల సత్రం బ్రిడ్జి నుండి నూనెపల్లె బ్రిడ్జి వరకు రెండున్నర కిలోమీటర్ల నాలుగు లైన్ల రహదారి పనులకు 19 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఇటివలే మంజూరు చేసిందన్నారు.జల వనరుల రాజధాని అయిన శ్రీశైలం ప్రాజెక్టు నుండి. సాగునీటి కాలువల ద్వారా 5 లక్షల 40 వేల 766 ఎకరాలకు సాగునీటిని అందించనున్నామన్నారు. కేసీ కెనాల్ కింద 1లక్షా 69 వేల 745 ఎకరాలకు, ఎస్ఆర్బిసి కాలువ ద్వారా 1లక్షా 53 వేల 936 ఎకరాలకు, తెలుగు గంగ పథకము కింద 1లక్షా 24 వేల 459 ఎకరాలకు, 38 ఎత్తిపోతల పథకాల ద్వారా 58 వేల 75 ఎకరాలకు, సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 21 వేల 300 ఎకరాలు, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 2000 ఎకరాలకు సాగునీటిని విడుదల చేస్తున్నామన్నారు. డాక్టర్. ఎన్.టి.ఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు రూ. 17 కోట్ల 44 లక్షలు ఖర్చు చేసి 9,287 మందికి శస్త్ర చికిత్సలు అందించడం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 2 లక్షల 50 వేల కుటుంబాలకు జాబ్ కార్డులు మంజూరు చేసి 2 లక్షల 42 మంది ఉపాధి వేతనదారులకు పని దినాలు కల్పించి 112 కోట్ల రూపాయలను వేతనాల రూపంలో చెల్లించామన్నారు.పియం సూర్య ఘర్ యోజన పథకం కింద ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్లను వినియోగించుకుని విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. రీ సర్వే వల్ల తలెత్తిన సమస్యలు, వివాదాలను గ్రామసభలు నిర్వహించి మూడు నెలలలోగా పరిష్కరించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం జరిగిందన్నారు.అంతకుముందు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల సభ్యులను స్టేజ్ మీదికి పిలిపించి సాంప్రదాయ రీతిలో శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించి పండ్లు, మిఠాయిలు బహుకరించారు. అనంతరం పోలీసు శాఖ వారి వజ్ర, డిఆర్డిఏ, డ్వామా, వ్యవసాయం, స్త్రీసంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, గనులు భూగర్భ జల శాఖ, పర్యాటక శాఖ, విద్యా, వైద్య ఆరోగ్యం, ఉద్యాన వనం, సూక్ష్మ సేద్యం, సివిల్ సప్లైస్, అగ్నిమాపక తదితర శకటాలను ప్రదర్శించి ఆహుతులను ఆకట్టుకున్నాయి. అలాగే సంబంధిత శాఖలు ప్రదర్శించిన ఎక్సిబిషన్ స్టాళ్లను అతిథులు సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.శకటాల ప్రదర్శనలో ప్రథమ బహుమతి గ్రామీణ నీటి సరఫరా, ద్వితీయ బహుమతి విద్యాశాఖ, తృతీయ బహుమతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలకు మెమెంటోలను మంత్రి అందచేశారు. అలాగే ఎగ్జిబిషన్ స్టాల్స్ కు సంబంధించి ప్రథమ బహుమతి డ్వామా, ద్వితీయ బహుమతి ఉద్యానశాఖ, తృతీయ బహుమతి డిఆర్డిఎ శాఖలకు మెమెంటోలను మంత్రి, కలెక్టర్ అందచేశారు. ఉత్తమ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించిన పాఠశాల విద్యార్థులకు, విద్యాసంస్థలకు జ్ఞాపికలు అందజేశారు.అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన జిల్లా అధికారులకు, ఉద్యోగులకు మంత్రి, కలెక్టర్ ప్రశంషా పత్రాలు అందచేశారు.

**నంద్యాల పట్టణంలోని పీఎస్ సి,& కెవిఎస్ సి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోని కొన్ని దృశ్యాలు**